



మా యింటి పక్క యింట్లో ఓ ముసలాయన కొత్తగా దిగేడు. ఎవరో ఏమిటో నేనంతగా పట్టించుకోలేదు. అతను వీధి వరండాలో వాలు కుర్చీలో కూర్చొని మనవణ్నో ఎవర్నో ఆడిస్తూ వుండడం మాత్రం రెండు రోజులు చూసేను. పక్కింటివాణ్ని పలకరించి తీరాలనే రూలును పాటించి మూడోరోజు సాయంత్రం ఆ ముసలాయన్ని పలకరించాను.

ఎవరు మీరూ అని అడిగే డాయన.

ఫలానావాణ్ని, పక్కింటి పెద్దమనిషినీ అని నేను చెప్పకున్నాను.

అయితే దయచెయ్యండన్నా డాయన. వీధిలోకో, యింటిలోకో నాకర్థం కాలేదు. అలా నిల్చున్నాను. ఇంతలో "అమ్మా, కుర్చీ" అన్నాడతను. అంతలో ముప్ఫయ్యేళ్ళావిడ కూతురు కాబోలు ఓ కుర్చీ తెచ్చి దబ్బున వడేసి చరువ వెళ్ళిపోయింది. ఆవిడా, ఆ మనవడూ, చీకటి మొఖాల వాళ్ళూ. వాళ్ళా చీకట్లో కూడా బావులేరు. ఆ విషయం గమనిస్తూ వుండిపోడంలో ఆవిడ తెచ్చిన కుర్చీకూడా బావులేకపోవడం గమనించలేదు. కూర్చోబోయి పడిపోబోయాను. పడిపోబోయి కాచుకున్నాను. నేను సరిగా కూర్చున్నాక - "జాగ్రత్త, కొంచెం చూసుక్కూర్చోండి. కుర్చీ బావులేదు. పడిపోగలరు" అన్నాడాయన. పడిపోబోయేను కదండీ! కొంచెం గాభరాపడ్డాను. పడిపోగల ప్రమాదం వుందని తెలియజేసినందుకు ఆయనకి నా కృతజ్ఞత తెలియజేసుకొని "బావుందండీ మేష్టరుగారూ, బావుంది. ఆ బావుంది. ఎన్నాళ్ళయిందండీ దిగీ" అని సంభాషణకి ఉపక్రమించేను. రెండ్రోజులయిందన్నాడతను. "అవును రెండ్రోజులయింది. తెలుసును" అన్నాన్నేను. "ఆహా" అన్నాడతను. మనవుడు అచ్చు మీలానే వున్నాడండీ" అన్నాను నేను. "మనవడు కాదు కొడుకు" అన్నాడతను. ముసలిముండాకొడుక్కి ఆ కుర్చీ తెచ్చినావిడ రెండో పెళ్ళి పెళ్ళాం కాబోలని అనుకుంటున్నాను. ఇంతలో ఆ తల్లి మళ్ళా ఒచ్చి 'రారా వెధవా' అంది. పిలుపు వినగానే కాకిపిల్ల కాకిదగ్గరకి పోయింది. "తల్లంటే మా సేరా ఆ అభిమానం" అన్నాన్నేను. "తల్లి కాదు, అక్క" అన్నాడతను. "అవునవును బావుంద"న్నా న్నేను. "సనేవైనా వుందా" అన్నాడతను. "ఏం లేదు. ఇల్లు చాలా బావుందీ" అన్నాన్నేను. "పిండికొద్దీ రొట్టె" అన్నాడతను. "బావుంది కానీ యింటివాడు దుర్మార్గపు ముండా కొడుకు సుమండీ, జాగ్రత్త అన్నాన్నేను. "ఎవరన్నారలాగా" అని అడిగేడతడు. నాతో ఎవరన్నారో నాకు చచ్చినా గుర్తు రాలేదు. ఎవరో అనడం ఎందుకూ? ఇదివర కద్దెకున్నవాణ్ని నానా పాట్లూ పెట్టి తగిలేశాడు కదా" అన్నాన్నేను. "వాడన్నాడా అలాగా" అని అడిగేడతను. అడిగిన వెంటనే వాలుకుర్చీలోంచి జువ్వలా లేచాడు. లేవగానే నాకు భయం వేసింది. "వాడేనా అన్నాడు?" అని గర్జించేడు ముసలాడు. ముసలా డలా గర్జించగలడని నే ననుకోలేదు. ఆ అరుపు వినగానే నా గుండెలు లటుక్కుమన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో నిరపరాధుల మీదికే తప్పలన్ని తోసేయాలనే న్యాయ సూత్రం మెరపు మెరిసిన కాలంలో గుర్తుకి తెచ్చుకుని "వాడేనండి రోజూ ఒచ్చి గోల గోల పెట్టేసేవాడు" అని కళ్ళు మూసుకుని అబద్ధం ఆడేశాను. ఆ ముసలాడే దుర్మార్గపు ముండాకొడుకైన ఆ ఇంటివాడని వేరే నాకెవరూ చెప్పక్కర్లేదు కదా మరి! అందుగురించి నాకేం అనుమానం లేకపోయింది. ఉన్న అనుమానం ఏమైనా వుంటే ఆ ముసలాడా చీకట్లో మూడో కన్ను తెరిచి వరండాలో విలయతాండవం చేసి ఇదివరకద్దెకున్న వాణ్ని 'అ' నుంచి 'క్ష' వరకూ అన్ని బూతులూ తిట్టి, హుంకరించి, ఫీంకరించి, ఘర్జించి నానాగోలా చేసి, అనుమానమంతా తీర్చేసేడు. ఆ యిల్లు ముసలాయన కష్టపడి చెమటోడ్చి సంపాదించిన రూపాయణాపైసల్తో స్వయంగా కట్టించుకున్న స్వంత ఇల్లట.

అదీ మా ఇద్దరి స్నేహానికి ప్రారంభం. ఇద్దరికీ మాకసలు ఘోరమైన దెబ్బలాట జరగవలసిందన్నమాట. కాని నేను తప్పంతా అమాయకుడిమీద తోసేసి గమ్మున చక్కా కూర్చున్నాను. పక్కింటి పెద్దమనిషినని పరిచయం చేసుకున్న ప్రకారం పెద్దమనిషిలాగే ప్రవర్తించాను. మూటా ముల్లే కట్టుకొని గంపెడు సంసారాన్ని వెంటబెట్టుకుని బుర్రమీద కొంగు వేసుకొని ఇల్లు ఖాళీచేసి పోయినవాణ్ని తిట్టుకోడంతో నాకూ ముసలాయనకీ స్నేహం పెంపొందింది. వర్ధిల్లింది.



జులై 30న తేదీ శ్రీ రా.వి. శాస్త్రి జన్మదినోత్సవం సందర్భంగా ఆయనకు మా శుభాకాంక్షలు
— ఎడిటర్

అప్పటికి ఆర్నెల్ల క్రితం తన ఏభయ్యయిదో ఏట ఆ ముసలాయన. గవర్నమెంటు సర్వీసునుంచి రిటైరయ్యేట్ట. అతనికి అరవయేళ్ళుంటాయి. కులద్వేషాన్ని పురస్కరించుకొని తాశిల్దారీతో అతనికి సరిపుచ్చేరుట. లేకపోతే అతను డిప్యూటీ కలెక్టరుగా రిటైరవ్వలసిందట. పనిచేసినన్నాళ్ళూ కష్టపడి చెమటోడ్చి పనిచేసేట్ట. కాని ఏం లాభం? "లాభం లేదు, లాభంలేదండీ" అని నేనూ అనేవాణ్ని. ఆ ముసలాయన అచ్చు రిటైర్డు తాశిల్దారులాగే వుంటాడు. పండిన ఎర్ర రంగు జుట్టు, చెక్కిన తిరగలి దిమ్మనంటి ముఖం, ముదిరిన ఆనప కాయనంటి పొట్ట, ఎదగడం బొత్తిగా మర్చిపోయిన కాళ్ళూచేతులూ-వీటన్నింటితోను అతను అచ్చంగా రిటైర్డు రిచ్ గవర్నమెంటు సర్వెంటులాగే వుంటాడు. అతగాడితో రోజూ నేను మాట్లాడి తెలుసుకున్న విషయం ఏమిటంటే అతను పుట్టిన క్షణం నుంచి కూడా కష్టపడుతూనే వున్నాట్ట. చెమటోడుస్తూనే వున్నాట్ట. అతను చెప్పే కబుర్లు నిజమైతే అతను చెరు వుల కొద్దీ చెమటోడ్చినట్టుగా మనం అనుకోవలసి వుంటుంది. అతను కష్టపడ్డం నేనంతగా చూళ్ళేదు. కష్టపడ్డం అంటే వాలు కుర్చీలో కూర్చోడం అని నేనెప్పుడూ అనుకోలేదు. వాలుకుర్చీల కూర్చుండీ కూడా అతనూరికే తెగ చెమటలు కక్కుతూ వుండే వాడు. దాన్నిబట్టి తనకాలంలో అతను చాలా చెమటోడ్చుండాలని నే ననుకున్నాను.


"కష్టే ఫలే! అంత కష్టపడ్డందుకు పోనీ ఇప్పుడు సుఖపడుతున్నారు కదా" అన్నానోసారి.

"ఏదోనండి! ఇలా వున్నాను. దీన్ని సుఖం అంటారా? అయితే అనండి" అన్నాడాయన తువాల్తో చెమట తుడుచుకుంటూ, నిట్టూర్పు విడుస్తూ, వాలు కుర్చీలో కూర్చొని చల్లగాలి పీలుస్తూ, దుక్కముక్కలా వుంటూ చెప్పరాని బాధేదో పడుతుంటాడు. పాపం, అమాయకుడు అనుకున్నాన్నేను.

కాని ఆ బాధేమిటో, ఆ కష్టం ఏమిటో నా ఊహకి అందలేదు. అతనికి ఓ కూతురూ, ఇద్దరు కొడుకులూ మాత్రం వున్నారు. కూతురుకి చనక రోజుల్లో పెళ్ళి చేసేడు. చిన్న కొడుకు చిన్నవాడు. ఆ బాలుడి గురించి ముసలాడికి పెద్ద బెడదేం లేదు. మరింక ఆ పెద్ద కొడుక్కి కావలసిన కాలేజీలో సీటూ, డిగ్రీ, నచ్చిన పిల్లా, అడిగిన కట్నం, కోరిన ఉద్యోగం దొరికేయుట. మరింక తన భార్యకి కావలసిన దేముంది? పట్నవాసంలో పెద్ద ఇల్లుంది. ఇంటి పన్ను తక్కువేయించుకొందికి మున్సిపాలిటీలో కావలసిన చుట్టాలున్నారు. ఇంటికి గాలీ, వెల్తురూ, కొళాయి, దీపాలు సదుపాయాలు వున్నాయి. కాలుమీద కాలు వేసుక్కూర్చుందికి వరండాలో వాలుకుర్చీ వుంది. ఓ రోజొచ్చినవాడు రెండో రోజు బైఠాయించకుండా వుండేందుకు వీలుగా విరిగీ విరగని కుర్చీ అతిథుల కోసం తయారుగా వుంది. మరి అతగాడి బాధేమిటో నాకేం బోధపళ్ళేదు.

అతణ్ని చూసి నా స్నేహితుడొకడు "ఎవ్రడా? బలిసిన పందికొక్కులా వున్నాడు?" అన్నాడు. అది

సిహోపమానం. నాకేం నవ్వలేదు. అతణ్ని చూస్తే నాకేం గుర్తుకొచ్చిందంటే, దుమ్ములకోసం కాళ్ళీడ్చుకుంటూ, పెద్దపులి వెనకాతల తిరిగే ముసలి బక్కా నక్కా గుర్తుకొచ్చేది. అతను ముసలివాడే కాని నక్కా కాదు, బక్కా కాదు. అతణ్ని చూస్తే నాకు జాలి వేసింది. కనికరం కలిగింది. పోనీ ఇప్పుడైనా సుఖపడుతున్నాడు కదా అనుకున్నాను. కాని అతనికేదో ఎందుకో రవంత భయం, కుసింత బెంగా లేకపోలేదు.



ఓసారి నేనో అర్జంటు పనిమీద చికాకోల్ వెళ్ళి, అక్కడ నాలుగు రోజులుండి అక్కడ పనేమీ కాకపోగా, చిరాకుపడి ఇంటికి తిరిగి వచ్చి చిక్కులన్నీ యథాతథంగా వుండడంవల్ల ఎవరిమీదైనా ఎగరటానికి ఏదైనా నెపం దొరుకుతుందా అని చూస్తున్నాను. అంతలో మా యింట్లో అందరూ ఏకగ్రీవులై ఉత్సాహభరితులై నాకు వార్త చెప్పేరు. అదేమిటంటే మా పక్కింటి ముసలాయనింట్లో రాత్రి దొంగలు పడి దోపిడీ చేసుకుపోయేరట. ఆ వార్త వినగానే నా చిరాకంతా ఎగిరిపోయింది.

వెంటనే ముసలాయన్ని పరామర్శ చెయ్యడానికి ఉత్సాహంతో బయల్దేరి వెళ్ళేను.

పాపం! ముసలాడు! ఏనుగులా వుండేవాడు. పీనుగులా అయిపోయేడు. సీమపందిలా చక్కగా వుండేవాడు. ఎడారి ఎలకలా బక్కచిక్కి పోయాడు. జీవచ్ఛవం, కొనవూపిరి, కళ్ళలో ప్రాణం శల్యావశిష్టం, ఇలాంటి మాటలన్నీ నాకు గుర్తుకొచ్చాయి. వాటి భావం నా కప్పుడు బోధపడింది.

ఏదో సానుభూతి ప్రకటించేను ఏపాటి పోయిందని అడిగేను.

వెయ్యి రూపాయిల్నగదూ, పత్తులాల బంగారం పోయేయిట. కష్టంమీద చెప్పేడు ముసలాయన. ఈసారి చెమట తుడుచుకోలేదాయన. అసలు మనిషంతా ఆవిరైపోయాడు. అయినా, వెయ్యీ పదీ నాకేం పెద్ద సంఖ్యల్లా తోచలేదు. నాకేం సంతృప్తి లేకపోయింది. పక్కింట్లో దొంగలు పడ్డప్పుడు లక్షలక్షలు పోవాలి. అది న్యాయం.

అంతేనా! పోన్లెండి అన్నాన్నేను.

“పోలీసువాళ్ళకి మరలాగే రిపోర్టిచ్చేను” అన్నాడు ముసలాయన.

నాకు బోధపళ్ళేదు. కాకపోతే మరెలా ఇస్తారు?

“అలా రిపోర్టివ్వకపోతే మరెలా ఇస్తారు?” అని అడిగేను.

“మరేం చెయ్యడం?” అన్నాడతగాడు.

ఏవిటేం చెయ్యడం? దేన్నేంచెయ్యడం! చెయ్యడం దేన్ని ఏవిటి? నాకేం అర్థం కాక అప్పుళ్ళా అభినయించి ప్రశ్న పరంపర కురిపించి నెమ్మదిగా కూపీ లాగాను.

నీతో కాకపోతే మరింకెవరితో చెప్పుకోడం తమ్ముడూ! విను చెప్తానంతా అన్నాడు ముసలాయన. విన్నానంతాను.

అసలేవిటయిందంటే:

నగదు పోవడమేమో ఇరవై వేలదాకా నగదు పోయిందిట. బంగారమేమో నూరు తులాలపై చిలుకు బంగారం పోయిందిట, కొన్ని తులాల వెండి వస్తువులు పోయేయిట. చాలా ప్రోనోట్లు పోయేయిట. మరింక బట్టలూ, గిట్టలూ, చెప్పక్కర్లేదుట. దాదాపు సర్వనాశనం అయిపోయిందిట.

అమ్మయ్య అనుకొని మరైతే పోలీసులకి రిపోర్టెందుకు స్వామీ అలా ఇచ్చేరూ?” అని కుతూహలపడి అడిగేను. ముసలాడు క్రుద్ధుడై పోయేడు. “అసలెంత పోయిందో చెప్తే నీకదంతా ఎలా ఒచ్చిందని పీక పట్టుకోరటండీ పోలీసువాళ్ళు. పెద్ద వెధవలేం చేసినా ఫరవాలేదు. మన్లాటివాళ్ళం కడుపు కక్కుర్తికి నిమ్నూ నిమ్నూ బక్కిరి బక్కిరి పాతిక రాళ్ళు సంపాదిస్తే గెద్దలన్నీ చేరి పిచికలమీద ఆరోపణల్లా, వాటి గురించి విచారణల్లా, ఆపైన శిక్షలూను. దేశం, ప్రభుత్వం, పాలనా అలా వున్నాయి బాబూ! అంచేత అంతే పోయిందని రిపోర్టు రాసుకున్నాను. లేపోతే బేడీలు ముందు మనకీ, ఆ తరవాత దొరికితే ఆ దొంగ వెధవలకీను” అని ముసలాడు ఒళ్ళుమర్చి కేకలువేసి, తెలివి తెచ్చుకుని తగ్గేడు.

ఓహో అదా సంగతి అనుకున్నాను.

కడుపు కక్కుర్తివల్ల కష్టపడి బంగారు మేడ కట్టించేడు. కడుపు కక్కుర్తివల్ల తెక్కష్టపడి కొడుకు పెళ్ళికి పదివేలు కట్నం లాగేడు. కడుపు కక్కుర్తివల్లనే కష్టపడి చెమటోడ్చి చెమటోడ్చి నిమ్నూ నిమ్నూ పీడించి పీడించి లంచాలు గుంజేడు.

బావుందిరా బాబూ అనుకున్నాను.

“ఎవరితో చెప్పకు బాబూ! చెప్తే కొంపలంటుకుంటాయి. నీ పుణ్యం వుంటుంది. ఎవరితోటి చెప్పకుస్మీ! ఏదో బతకనీ నన్ను” అన్నాడు.

బతకనివ్వకపోతే ముసలాణ్ని చంపగల్నా! సరే ఒస్తాను. అని కుంటి కుర్చీలోంచి బైటపడి ఇంటికి పోబోతూ “ఇంట్లో కసలు దొంగెలా దూరేడు?” అని అడిగేను అనుమానం వచ్చి.

“చూద్దువుగాని రా” అన్నాడు. లోనికి వెళ్ళేను. ఇనప్పెట్టె గదని ఓ గదుంది. అందులోకి తీసుకు వెళ్ళేడు. ఆ గదికి ఓ వార ఓ కిటికీ వుంది. ఆ కిటికీ ఇనప గజాలు బారుగా ఓ మనిషి దూరడానికి వీలుగా వంచేసి వున్నాయి. గదిలో ఓ మూల చీకట్లో మృగంలా వుంది ఇనప్పెట్టె. ఇనప్పెట్టె ఇనప తలుపు కోసేసి వుంది. ముసలి భర్తా, భార్యా డాబామీద పడుకున్నారుట. దిగువ ఈ ఘోరం జరిగిందట.

వంచగా వంగిన ఇనుప గజాల్ని, కోసేయుగా విరిగిన ఇనుప తలుపునీ చూసి ఆ దొంగెవడో ఆ రాత్రల్లా అలా అంత కష్టపడి ఎంత చెమటోడ్చాడో అనుకున్నాన్నేను. అనుకొని ముసలాయన్నీ, ఇనప్పెట్టెనీ ఆ చీకటి కొట్లో ఒదిలేసి వీథిలో కొచ్చాను. దొంగతనం ఎందుకు చేయరాదో ముసలాడికి ఇప్పటికీ అవగాహన కాలేదు. కాదు. అదంతే.